


సీఎం పర్యటన రద్దవడంతో బెండాలపాడు గ్రామంలో సభాస్థలిలో ఏర్పాటు పనులు ఆపేసిన సిబ్బంది, కూలీలు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

బుధవారం 20 ఆగస్టు 2025

సీఎం రేపటి పర్యటన

వాయిదా

- సొంతిళ్ల కోసం ఎదురుచూస్తున్న బెండాలపాడు ఆదివాసీల్లో నిరాశ
- త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ గ్రామానికి రావాలని ఆకాంక్ష

చండ్రుగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన వాయిదా పడింది. గురువారం చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరు కావాల్సి ఉండగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపరాష్ట్రపతి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను ఆయన ఢిల్లీ వెళ్తున్న కారణంగా గురువారం భద్రాద్రి జిల్లా పర్యటన వాయిదా పడినట్టు సభావేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తెలపగా.. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. తదుపరి సీఎం పర్యటన ఉండే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు.

నిరాశ చెందిన ఆదివాసీలు

దశాబ్దాలుగా తాము ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరుతోందని, గురువారం తాము గృహప్రవేశాలు చేయబోతున్నామని కొండంత ఆశతో ఉన్న బెండాలపాడు గ్రామంలోని ఆదివాసీలు సీఎం పర్యటన రద్దుతో నిరాశకు గురయ్యారు. సీఎం రాక నేపథ్యంలో

(మిగతా 6వ పేజీలో)

డీఈవోగా అదనపు కలెక్టర్ శ్రీజ ?

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజకు అదనపు బాధ్యతలు అప్పగించారని సమాచారం. గాడి తప్పిన జిల్లా విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు ఆమె ఈ బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. గతంలో విద్యాశాఖలో పని చేసిన పలువురు అధికారుల తీరు కారణంగా అనేక ఆరోపణలు రావటంతో పాటు పలు పాఠశాలల నిధులు మాయం కావటం లాంటివి జరగటంతో.. అన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఐఏఎస్‌కు బాధ్యతలు అప్పగించిందన్న చర్చ జరుగుతోంది.

కోడిగుడ్ల సరఫరాకు

ఈ-టెండర్లు ఖరారు

ప్రక్రియ నిర్వహించిన అదనపు కలెక్టర్

6



విడవని వాన

- ఉమ్మడి జిల్లాలో ముసురు
- తాలిపేరు 10 గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కుల నీరు విడుదల
- సింగరేణిలో 47టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- వానలకు ధ్వంసమవుతున్న రోడ్లు
- మరమ్మతులకు అంచనాలు వేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- పలుచోట్ల కుళ్లిపోతున్న పత్తి మొక్కలు



అశ్వారావుపేట మండలం నారంవారి గూడెంలో కోతకు గురైన బీటీ రోడ్డు

ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి) / కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 19 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదారురోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో గత రెండురోజులుగా ముసురు వీడటం లేదు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఖమ్మం జిల్లాలో 14.0మి.మీ. సగటు వర్షపాతం నమోదుగాకాగా అత్యధికంగా బోనకల్ మండలంలో 30.5 మి.మీ., చింతకానిలో 24.4మి.మీ., వేంసూరులో 23.1మి.మీ., మధిర 21.3 మి.మీ., పెనుబల్లి 19.3మి.మీ., నేలకొండపల్లి 17.8మి.మీ, కూసుమంచి 17.4 మి.మీ., సత్తుపల్లి 15.1మి.మీ., ముదిగొండ 13.8మి.మీ., వైరా 13.8మి.మీ., ఎర్రుపాలెం 13.3.మి.మీ., కామేపల్లి 10.3 మి.మీ. చొప్పున వర్షపాతంపడగా మిగిలిన మండలాల్లో 4నుంచి 9మి.మీ. వర్షం పడింది. జిల్లాలో ముసురు వర్షం వల్ల రైతులు, వ్యాపారులు, ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. వీధి వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. మున్నేరు, ఆకేరు వంటి ఏర్లు, వాగులు పొంగి ప్రవ హి స్తుం డ గా, పాలేరు, వైరా,



ముసురు వానకు కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద పత్తి చేలో మేట వేసిన దృశ్యం

లంకసాగర్ ప్రాజెక్టులు నీటితో కళకళలా డుతున్నాయి.

సీతారామపట్నంలో రాష్ట్రంలోనే అత్యధికం..

భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. పాల్వంచ మండలం సీతారామపట్నంలో 9.3సెంమీ వర్షపాతం నమోదైంది. దాంతోపాటుగా చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడు, ఇల్లెందులో 5.4, ముల్కలపల్లిలో 5.1, సుజాతనగర్‌లో 4.7, లక్ష్మీదేవిపల్లిలో 4.5, బూర్గంపాడులో 4.2, దమ్మపేట మండలం అంకంపాలెంలో 3.98, కొత్తగూడెంలో 3.5, టేకులపల్లిలో 3.2, భద్రాచలంలో 3, పాల్వంచ మండలం యానంబైలులో 2.3, జూలూరుపాడులో 1.2, అన్నపురెడ్డిపల్లిలో 1.1 సెంమీ వర్షపాతం నమోదైంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రా జెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. 404 అడుగులకు చేరింది. దాంతోపాటు జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో 47,743 టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గడిచిన నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో బీటీ రోడ్డు కోతకు గురైంది.

దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అంచనాలు

వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖమ్మంనుంచి భద్రాచలం, మధిర వైపు, హైదరాబాదు, వరంగల్, ఇల్లెందు వైపు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు పలుచోట్ల దెబ్బతిన్నాయి. వరద ప్రవాహంతో అప్రోచ్‌లు, రోడ్లు కొట్టుకుపోయాయి ఖమ్మంకార్పొరేషన్‌తోపాటు పలు మునిసిపాలిటీల్లో రోడ్లు గుంతలుగా మారాయి. మరమ్మతుల కోసం అంచనాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో ఆర్‌అండ్‌బీ, పీఆర్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ తదితర ఇంజనీరింగ్ విభాగాలు వర్షాలతో దెబ్బతిన్న రహదారులు కాలవలు, అప్రోచ్‌లు, కల్వర్టుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

పత్తి రైతు ఆశల ఆవిరి

ముసురు వానలకు అక్కడక్కడా పత్తి పంట దెబ్బతింటోంది. ముఖ్యంగా వాగులు, ఏర్లు పక్కన ఉన్న పొలాల్లో వరద నీరు ప్రవహించి మొక్కలు కుళ్లిపోతున్నాయి. ఈ ఏడాది ఎంతో ఆశతో సాగుచేసిన పత్తి పంటలు వానలకు దెబ్బతింటుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటి వరకు రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టామని, ఏపుగా పెరుగు తున్నాయనుకున్న సమయంలో ఇలా వరద, ముసురు వానలకు పంట దెబ్బతింటోందని పలువురు రైతులు వాపోతున్నారు.

మళ్లీ పెరుగుతున్న

గోదావరి

- భద్రాద్రి వద్ద 38.3 అడుగులకు నీటిమట్టం
- నేడు తొలి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం
- అప్రమత్తమైన అధికారులు

వివరాలు 6లో..

అదనంగా వస్తేనే..



- ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత తీరేది..
- వినియోగం అంచనా 15వేల మెట్రిక్ టన్నులు
- వచ్చింది 7వేల మెట్రిక్ టన్నుల బస్తాలు
- వాన తెరిపిస్తే మరింత అవసరత

ఖమ్మం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఈ ఏడాది వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో సుమారు సుమారు పదిన్నర లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అవన్నీ ఇప్పుడు ఎరువులు వేసే దశకు రాగా.. ప్రస్తుతం ముసురువానలు పడుతుండటంతో రైతులు తెరిపి వచ్చే వరకు వేచి చూస్తున్నారు. వాన తెరిపినివ్వగానే ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో తమకు అవసరమైన మేరకు యూరియా, ఇతర ఎరువులు కొనుగోలు చేసేందుకు ఉరుకులుపరుగులు పెడుతున్నారు. అయితే ప్రస్తుతం సాగయిన పంటలకు యూరియా వినియోగం అంచనా అధికారుల లెక్కల ప్రకారం 15వేల మెట్రిక్‌టన్నులు కాగా.. ఇప్పటి వరకు 7వేల మెట్రిక్‌టన్నుల బస్తాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ మున్ముందు ఈ యూరియాకు డిమాండ్ మరింత ఉంటుందని, అదనంగా వస్తే తప్ప యూరియా నిల్వలు సరిపోయే అవకాశం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతన్నాయి. అయితే ప్రస్తుతం తలెత్తిన యూరియాకొరత నివారణకు అధికారులు చర్యలు చేపట్టడంతోపాటు డిమాండ్ ఉన్న సొసైటీలు, డీలర్లకు ఎరువులు సరఫరా చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ముసురు తగ్గితే యూరియా డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంవతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియోకాన్ఫరెన్సు ద్వారా దిశానిర్దేశం చేశారు. దీంతో ఇరు జిల్లాల అధికారులు యూరియా విక్రయాలపై నిఘా ఉంచారు. ఇప్పటికే రైతులు కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ పెట్టుకుంటున్నా.. వర్షం తెరపిస్తే యూరియాకు విపరీతమైన డిమాండ్ రాబోతోంది. సహజంగా వర్షాలు వల్ల పంటలు

(మిగతా 6వ పేజీలో)

ప్రమాదపుటంచున..

శిథిలావస్థలో రాజీవ్ గృహకల్ప సముదాయం

- నెర్రెలు బారిన భవనాల్లో భయంభయంగా ప్రజలు
- ఇప్పటికే రెండు సార్లు ముంచెత్తిన మున్నేరు
- మరోసారి వరదొస్తే ఉనికికే ప్రమాదమంటున్న స్థానికులు

ఖమ్మం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు గూడు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 18ఏళ్ల క్రితం నాటి ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గృహకల్ప భవనాలను నిర్మించింది. ఈ క్రమంలోనే ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రెవెన్యూ పరిధిలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో సుమారు 20 ఎకరాల్లో మొత్తం 32 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఒక్కోదానిలో 24 ప్లాట్లు ఏర్పాటు చేసి.. మొత్తం 768ఇళ్ల నిర్మాణం చేశారు. బ్యాంకుల నుంచిరూ.1.20లక్షల రుణాలు ఇప్పించి వాటిని లబ్ధిదారులకు కేటాయించింది. 2020లో బ్యాంకులు వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం ఇవ్వడంతో బకాయిలు చెల్లించి బ్యాంకుల వద్ద నుంచి లబ్ధిదారులు డాక్యుమెంట్లు కూడా తీసుకున్నారు. అయితే 18ఏళ్లగా ప్రజలు అందులోనే నివాసం ఉంటుండగా.. ప్రస్తుతం ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వరుసగా రెండు సార్లు వచ్చిన మున్నేరు వరద ఉధృతికి భవనాలు నెర్రెలు బారాయి. మరోసారి వరద వస్తే భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న గృహకల్ప సముదాయం

మరమ్మతులకు నోచుకోని వైనం..

18 ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప భవనాలకు నేటి వరకు ఏనాడు మరమ్మతులు చేయని పరిస్థితి. భవనాల మధ్యలో రావి, ఇతర మొక్కలు పెరుగుతున్నాయి. స్లాబ్‌ల నుంచి ఇనుప చువ్వలు బయటకు వస్తున్నాయి. మున్నేరు వడ్డున భవనాలు నిర్మించడంతో గత ఏడాది, ఈ ఏడాది వచ్చిన వరదలకు గృహకల్ప ప్రాంతం మొత్తం మునిగిపోయింది. వరద ఉధృతికి ప్రజలు అతలాకుతలం అయ్యారు. గృహ సముదాయంలో కింద ఫ్లోర్లలో ఉన్న ఆదనపు నిర్మాణాలు వరదలకు నేలమట్టమయ్యాయి. వందల మంది నివాసం ఉండే సముదాయం మరింత బలహీన పడిందని, ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఏదైనా జరిగితే ప్రాణనష్టం భారీగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పెను ప్రమాదం సంభవించక ముందే ఇప్పటికైనా మరోచోట ఇళ్ల నిర్మాణం చేరి తమను అక్కడికి మార్చాలని గృహకల్ప వాసులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఇరు జిల్లాలకు

ఐదు ఏటీసీలు

- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

వైరా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు ఐదు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లు మంజూరయ్యాయి. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి జీవోను జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 46 కొత్త ఏటీసీలను మంజూరు చేయగా వాటిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఐదు ఉన్నాయి. టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ ఏటీసీలను మంజూరు చేశారు. ఖమ్మం జిల్లాలోని వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం తూతకీలింగన్నపేట(టీఎల్‌పేట), సత్తుపల్లి నియోజకవర్గంలోని తుంబూరు, పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, ఇల్లెందు ప్రాంతాల్లో ఈ ఏటీసీ కాలేజీలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీకి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో వీటికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఐటీఐలకు ఏఐ టెక్నాలజీ జోడించి అధునాతన సాంకేతికతతో ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఈ జీవో జారీ చేసింది.

నష్టాల నుంచి లాభాల్లోకి డీసీసీబీ

- కొత్తగా నాలుగు శాఖల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి

ఖమ్మం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గతంలో నష్టాల్లో ఉన్న ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తోందని, లావాదేవీల్లో రాష్ట్రంలో కరీంనగర్ తర్వాత రెండోస్థానంలో నిలిచిందని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 100 సహకారసంఘాలు, 50బ్రాంచీలతో నడుస్తున్న డీసీసీబీలో కొత్తగా మరో నాలుగు శాఖలు మంజూరయ్యాయని, వాటిని రఘునాథపాలెం మండలం మంచుకొండ, మధిర మండలం సిరిపురం, అశ్వాపురం మండలం మొండికుంట, అశ్వారావుపేట మండలం నారాయణపురంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇక అన్నపురెడ్డిపల్లి, సారపాక శాఖలను మార్చే ప్రతిపాదన ఉందని తెలిపారు. ఖమ్మం డీసీసీబీ 2024-25లో రూ.3,460కోట్లు లావాదేవీలు నిర్వహించిందని తెలిపారు. 2023-24లో రూ.2,984కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందని వివరించారు. 2019-20లో రూ.994కోట్లు ఉన్న డిపాజిట్లు ప్రస్తుతం రూ.1,265కోట్లుకు చేరాయని, డీసీసీబీలో మొత్తం రూ.2195కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. బంగారం రుణాల కు ఎక్కువ ఆదరణ ఉంటోందని, ఇప్పటికే బంగారంపై రూ.85కోట్లు రుణాలుఇచ్చామన్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో 25శాతం అదనంగా బ్యాంకు ఉద్యోగులకు వేతనాలు పెంచ డంతో పాటు జిల్లా సహకార సంఘాలకు రూ.6కోట్లు లాభాల్లో వాటా ఇచ్చామని, ప్రస్తుతం డీసీసీబీ రూ.6కోట్ల లాభాల్లో ఉందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్ప టి వరకు రైతులకు రూ.923కోట్లు రుణాలు ఇచ్చామని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం తో డీసీసీబీని రైతులకు మరింత చేరువ చేసేందుకు సేవల ను మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. పాత బకాయి ల వసూలుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, న్యాయపరంగా కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వ్యవసాయ భూమి తాకట్టుతో గృహ రుణాలు, విదేశీ విద్యా రుణాలు అందిస్తున్నామని, అయిల్‌పామ్ సాగుకు రైతులకు,

(మిగతా 6వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పక్కన డైరెక్టర్ రామబ్రహ్మం, సీఈవో వెంకట ఆదిత్య

సాగదీస్తున్నారు..

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మునిసిపల్ అధికారులు
మూడేళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సుందర పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ పనులు చేయడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పొరేషన్‌కు 2022- 24 ఆర్థిక సంవత్సరంలో డిస్ట్రిమినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ)కింద రూ. 67.25 కోట్ల నిధులతో 165 పనులు చేపట్టగా 50 శాతంకు పైగా పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గత మూడేళ్లుగా నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెంలోని పలు వార్డుల్లో డ్రైనేజీ పనులు, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు. 36 వార్డుల్లో కొనసాగుతున్న పనుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు కొందరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. నిర్మాణ పనులకు గోదావరి ఇసుకను ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ స్థానికంగా మొర్రేడు, గోధుమలవాగుల నుంచి ఇసుకను వినియోగిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. తక్కువ ధరకు



న్యూగొల్లగూడెం రహదారి పక్కన అసంపూర్తిగా నిలిచిన డ్రెయినేజీ పనులు

దొరికే ఇసుక పైనే కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం వల్ల నాణ్యత లోపిస్తుందనే విమర్శలు వస్తోన్నాయి. మున్సిపల్ పరిధిలోని సూర్య ప్యాలెస్ నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి వైపు రోడ్డు వెడల్పు పనులు కొంతమేర పూర్తిచేసి, మిగతా పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మేదరబస్తీ సమీపంలోని రాజీవ్‌గృహకల్ప నుంచి న్యూగొల్లగూడెం వరకు డ్రైనేజీ కోసం తవ్వకాలు చేసిన అధికారులు పనులు చేపట్టకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వారి వాహనాలను రోడ్లపైనే నిలుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ రహదారిపై వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మిషన్‌భగీరథ అధికారుల మధ్య సమన్వయం లోపంతో అధికారులు రోడ్లు వేసిన అనంతరం భగీరథ పైపులైన్ల నిర్మాణ పనుల కోసం రోడ్లను పగులకొట్టడం పరిపాటిగా మారింది. మున్సిపాలిటి, మిషన్‌భగీరథ



సింగరేణి ప్రధాన కార్యాలయ సమీపంలో సెంట్రల్ లైటింగ్ కోసం రోడ్డు మధ్యలో తవ్విన గుంతలు

రెండూ ప్రభుత్వ శాఖలు కావడంతో రోడ్డు కట్టింగ్ చార్జీలను సైతం వసూలు చేయలేని పరిస్థితి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని వివిధ వార్డుల్లో పైపులైన్ కోసం తవ్విన గుంతలతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు సెంట్రల్ లైటింగ్ పోల్స్ కోసం రోడ్డు మధ్యలో తవ్వకాలు చేసినప్పటికీ ఆ పనులు పూర్తికాక గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ మేరకు సెంట్రల్ లైటింగ్ కోసం తవ్విన గుంతల్లో స్తంభాలను వెంటనే ఏర్పాటుచేయాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనుల వివరాలు, నాణ్యత ప్రమాణాలపై మున్సిపల్ డీఈ వివరణ

కొత్తగూడెం కార్పొరేషన్‌లోని పలు వార్డుల్లో డీఎంఎఫ్‌టీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ డీఈ రవికుమార్‌ను వివరాలు అడగగా.. నిధులు, నాణ్యత, అభివృద్ధి పనుల వివరాలను అందరికీ చెప్పాల్సిన అవసరం లేదని.. ఏదైన సమాచారం కావాలంటే ఆర్టీఐలో దరఖాస్తు చేసుకుంటే.. ఆ వివరాలను పై అధికారుల ఆదేశాల మేరకు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

- భద్రాద్రి వద్ద రాత్రి 11 గంటలకు 38.3 అడుగులకు చేరిన నీటిమట్టం
- నేడు తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- అప్రమత్తమైన అధికారులు



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 3.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయడంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు తగ్గుముఖం పడుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. దీంతో బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి తొలి ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 43 అడుగులకు చేరే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అంతకు ముందు సోమవారం రాత్రి 11 గంటలకు 38.5 అడుగలకు చేరిన గోదావరి నీటిమట్టం అర్థరాత్రి ఒంటి గంటకు 38.5 అడుగులకు తగ్గింది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు 37.9 అడుగులకు తగ్గగా ఉదయం 6గంటలకు 37.3, 9గంటలకు 36.8, మధ్యాహ్నం 12 గంటలకు 36.4 అడుగులకు చేరింది. మధ్యాహ్నం 3 గంటలకు 36 అడుగులకు తగ్గి.. 4 గంటల నుంచి మళ్లీ క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు 36.3 అడుగులకు, రాత్రి 11 గంటలకు 38.3 అడుగులకు పెరిగింది. బుధవారం సాయంత్రానికి తొలి ప్రమాద హెచ్చరిక స్థాయికి (43 అడుగులకు) చేరే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా గోదావరి స్నానఘట్టాలు నీటమునగడం, ప్రవాహం తొలి ప్రమాద హెచ్చరికకు చేరువవుతుండటంతో అధికారులు ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను మోహరించారు. అలాగే భక్తులను స్నానాలకు గోదావరిలోకి దిగకుండా నియంత్రిస్తున్నారు.

కోడిగుడ్ల సరఫరాకు ఈ-టెండర్లు..

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మధ్యాహ్న భోజనం మినహాయించి అన్ని గురుకుల విద్యాసంస్థలు (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ), అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం టెండర్లలో 3 ఈ-టెండర్లను ఖరారు చేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, మంగళవారం కోడిగుడ్ల సరఫరా ఈ-టెండర్లను ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గురుకుల విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు రెగ్యులర్‌గా కోడిగుడ్లు సరఫరా చేసేందుకు ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానించామని, నితిషా పౌల్ట్రీ ఫార్మ్స్, వెంకట్రామ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, పీవీఎస్‌ఎస్ పౌల్ట్రీ లిమిటెడ్ సంస్థల నుంచి ఈ-టెండర్లు దాఖలయ్యాయన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఈ-టెండర్లలో ఒక కోడిగుడ్డుకు వెంకట్రామ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ 5.99 రూపాయలు, నితిషా పౌల్ట్రీ ఫార్మ్స్ 6.27 రూపాయలు, పీవీఎస్‌ఎస్ పౌల్ట్రీ లిమిటెడ్ 6.66 రూపాయలకు కోట్ చేస్తూ ఈ-టెండర్లు వేశారు. నిబంధనలను పాటిస్తూ, తక్కువ ధరకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు ముందుకు వచ్చిన వారికి టెండర్ అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం టెండర్‌కు సంబంధించి సరఫరాదారులకు ఉన్న సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.పురందర్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ, జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు
కళల్లోనూ నైపుణ్యం సాధించాలి

పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీప్రసాద్
పాలేరు జవహర్ నవోదయలో ముగిసిన క్లస్టర్ స్థాయి కళాఉత్సవ్ 2025-26

కూసుమంచి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక కళ ఉంటుందని, దానిని వెలికితీసి ప్రదర్శించినపుడే గొప్ప కళాకారులుగా కీర్తింపబడుతారని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ 2025-26 మంగళవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఆటలు, పాటల రూపంలో సమాజంలో జరుగుతున్న విషయాలను వివరిస్తూ మార్గదర్శకులవుతున్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో రామాచారి, విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఆర్ట్ టీచర్ వెంకటేశ్వర్లు, మ్యూజిక్ టీచర్ రవిశంకర్, పూర్వ ఆర్ట్ టీచర్ సురేష్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు ఆతిధ్య ఖమ్మం జిల్లాకు చెందిన నవోదయ విద్యాలయాల విద్యార్థులు సుమారు 100మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, కర్ణాటక, హిందుస్థానీ, దేశీయ వాద్య సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, జానపద, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించగా ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నిండుకుండలా కిన్నెరసాని..

రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాల్వంచ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువన భారీ వర్షాలకు వస్తున్న వరదతో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం నిండుకుండలా మారింది. పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. మంగళవారం 404.60 అడుగులకు చేరింది. దీంతో రాత్రి రెండుగేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదలచేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మహబూబాబాద్,పాకాల కొత్తగూడ నుంచి గుండాల అటవీ ప్రాంతాల మీదుగా ఇల్లెందు, కొత్తగూడెం, టేకులపల్లి నుంచి భారీగా వరద జలాశయానికి చేరుతోంది. దీంతో అధికారులు డ్యాం వద్దనే ఉంటూ తక్షణచర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంత ప్రజలకు హెచ్చరికలను జారీచేశారు. గేట్లను



నిండుకుండలా కిన్నెరసాని

ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రజలు వాగులు దాటవద్దని హెచ్చరికలు చేశారు. రైతులు పరివాహక ప్రాంతంలో నాట్లు, పొలం పనులకు వెళ్లవద్దని తెలిపారు. గేట్లనుఎత్తడంతో పాల్వంచ, బూర్గంపాడు మండల అధికారులు అప్రమత్తమయ్యారు.

రైతునేస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ అధికారి బాబూరావు

మణుగూరు టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతు వేదికల ద్వారా ప్రతి మంగళవారం ప్రభుత్వం అందిస్తున్న రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావు కోరారు. మంగళవారం మండల పరిధిలోని గుట్ట మల్లారం గ్రామంలో రైతు వేదికలో జరిగిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పంటల సాగు విషయంలో రైతులకు పలు సూచనలు సలహాలు ఇస్తారన్నారు. రైతులు తరుచుగా రైతునేస్తం కార్యక్రమానికి హాజరై వ్యవసాయ సాగులో మెళకువలను పొందాలని కోరారు. అనంతరం తిర్లాపురం పంచాయతీ పరిధిలోని వరి, పత్తి, కూరగాయాల సాగులను పరిశీలించారు.



రైతునేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

పంటలపై రైతులకు తెగుళ్ల నివారణకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శివ, హరిశ్చంద్ర, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ భరత్, మండల వ్యవసాయాధికారి బి.రాహుల్, వ్యవసాయ విస్తరణ అధికారులు కొమరం లక్ష్మణ్‌రావు, హారిక, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన అండర్-15
బాల బాలికల వాలీబాల్ టోర్నీ



అండర్-15 రాష్ట్రస్థాయి బాలుర వాలీబాల్ టోర్నీలో గెలుపొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు

మొదటిస్థానంలో భద్రాద్రి బాలుర జట్టు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో రెండ్రోజులపాటు నిర్వహించిన అండర్-15 బాల బాలికల 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, ఎంపిక ప్రక్రియలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర వాలీబాల్ టోర్నీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటిస్థానంలో నిలువగా రంగారెడ్డి, మంచిర్యాల జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. అలాగే బాలికల వాలీబాల్ టోర్నీలో నిజామాబాద్ జిల్లా మొదటిస్థానంలో నిలువగా సూర్యాపేట, నారాయణపేట జిల్లాలు రెండు, మూడు స్థానాలు సాధించాయి. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావుల చేతుల మీదుగా విజేతలైన జట్లకు మెమెంటోలు, పతకాలు అందజేశారు. ఈ టోర్నీలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 25 నుండి పూణేలో జరుగబోయే జాతీయస్థాయి టోర్నీలో మరింతగా రాణించాలని వక్తలు ఆకాంక్షించారు.

వైద్య ఆరోగ్యశాఖ చట్టాలపై
డాక్టర్లకు ఒకరోజు సదస్సు

ఖమ్మం డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ చట్టాలపై ఈ నెల 20న కలెక్టరేట్ ప్రగతి మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి తెలిపారు. జిల్లాలో రిజిస్టరైన అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్లు, యజమానులకు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఇన్ఫర్టిలిటి సెంటర్లు, అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, ఆయుష్ క్లినిక్‌లతో పాటు ప్రైవేట్ డాక్టర్లు, డెంటిస్టులు, ప్రభుత్వ, ప్రైవేట్, రేడియోలజిస్టులు, గైనకాలజిస్టులకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒరియేంటేషన్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నియమాలు, నిబంధనలు, చర్యలు, శిక్షలు, పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ 1994 రూల్స్, 1996 సరోగసీ చట్టం, సీజనల్ వ్యాధులు మలేరియా (ఐడీఎస్పీ) పోర్టల్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, పోర్టల్ హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్ (హెచ్ఎఫ్ఆర్), హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్ (హెచ్‌పీఆర్)లో సమాచార విలీనం, వైద్య నిర్లక్ష్యం, అనైతిక పద్ధతులు, అగ్నిమాపక భద్రత, బయోమెడికల్ కాలుష్య నియంత్రణ బోర్డు సమస్యలపై కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

అదనంగా వస్తేనే..

(5వ పేజీ తరువాయి)

ఎర్రబడకుండా ఉండేందుకు తక్షణం యూరియా రైతులకు అవసరం ఉంటుంది.

పదిన్నరలక్షల ఎకరాల్లో పంటలు..

వానాకాలం సాగుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సుమారు పదిన్నర లక్షల ఎకరాల్లో పలు పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గితే ఈ పంటలకు యూరియా వేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడిజిల్లాలో వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 15వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటికే 7 వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియాజిల్లాకు వచ్చింది. ఈ నిల్వలు ప్రస్తుతానికి మాత్రమే సరిపోతాయని, మున్ముందు మరింత డిమాండ్ ఉంటుందని, అదనపు కోటాలో యూరియా వస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఖమ్మం జిల్లాలో జూన్‌లో 131.మి.మీకుగాను 123.9మి.మీ, జూలైలో 240.9 మి.మీ.కు 281.6 మి.మీ. వర్షం పడింది. ఆగస్టులో 249మి.మీ.గాను 244మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాలు సమృద్ధిగా పడటంతో పంటలకు మేలు చూకూరింది.

● ఖమ్మంజిల్లాలో 6లక్షలపైగా ఎకరాల్లో పంటలు వేయగా.. అందులో వరి 2.70లక్షల ఎకరాలు, మొక్కజొన్న 1,623ఎకరాలు, పత్తి 2,22,655 ఎకరాలు, చెరకు 463ఎకరాలు, వేరుశనగ 236 ఎకరాలు, మినుము 220 ఎకరాలు, పెసర 18,194 ఎకరాలు, కంది 268 ఎకరాలు, జనుము 86,971 ఎకరాల్లో వేశారు. ఇవి కాకుండా మిర్చి 460 ఎకరాలు, ఆయిల్‌పామ్ తదితర పంటలు కూరగాయల పంటలు వేశారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగన్నర లక్షల ఎకరాల్లో పంటలు వేయగా.. పత్తి 2.16 లక్ష ల ఎకరాలు, లక్ష 39వేల వరి, లక్ష ఎకరాల్లో మొ క్కజొన్న, 355ఎకరాల్లో పెసర, 300 ఎకరాల్లో ఆయిల్‌పామ్, 370 ఎకరాలు మిర్చి, 350 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యాయి. ఈ జిల్లాలో ఇప్పటికే జూన్‌లో 169.1మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా 134.4మి.మీ., జులైలో 312.7మి.మీ. కురవాల్సి ఉండగా 378.9మి.మీ. వర్షం కురిసింది. ఆగస్టులో 300.మి.మీ పడాల్సి ఉండగా ఇప్పటికి 197.7మి.మీ.వర్షపాతం పడింది.

భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయాధికారికి ఘన సత్కారం

పాల్వంచ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయాధికారి పాటిల్ వసంత్‌ను నేతాజీ యువజన సంఘం సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సేవా సంస్థ ప్రారంభించి 32 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అహ్మద్ న్యాయాధికారిని కలిసారు. నేతాజీ యువజన సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా న్యాయాధికారి అభినందించారు. కార్యక్రమంలో కొత్తగూడెం జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా న్యాయాధికారిని సత్కరిస్తున్న అహ్మద్

వారసత్వ ఉద్యోగ సమస్యలపై
సింగరేణి సీఎండీకి వినతి

మణుగూరు టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ కంపెనీలో అనారోగ్య కారణాల వల్ల అన్‌ఫిట్‌కు దరఖాస్తులు చేసుకున్న కార్మికులను తొలగించి వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మికసంఘం గౌరవ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జే.సీతారామయ్య, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ.అనురాధలు సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మెడికల్ బోర్డులో లోపాలను సరిచేసి దరఖాస్తు చేసుకున్న కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యాజమాన్యం మెడికల్ బోర్డు తీసుకుంటున్న నిర్ణయాలు సింగరేణి వ్యాప్తంగా కార్మికులందరిలో నిరాశ, ఆందోళనను కలిగిస్తున్నాయని తెలిపారు. బోర్డు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మెడికల్ బోర్డు తిరస్కరించిన 32 మంది దరఖాస్తు దారులను అన్‌ఫిట్ చేసి వారి కుటుంబీకులకు ఉద్యోగాలు ఇవ్వాలి, మెడికల్ బోర్డులో ఉన్న లోపాలను సవరించాలని సీఎండీకి వివరించినట్లు తెలిపారు.

నష్టాల నుంచి లాభాల్లోకి డీసీసీబీ

(5వ పేజీ తరువాయి)

గిరిజన రైతులకు పోడుపట్టాలున్న వారికి వ్యవసాయ రుణాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో రెండు ఏటీఎం మొబైల్ వాహనాలతో మారుమూల గ్రామాల్లో కూడా నగదు పొందే సౌకర్యం కల్పించామని, బ్యాంకు సభ్యులకు ఇన్సూరెన్సు కవరేజీ గతంలో రూ.50వేలు ఉండేదని, దాన్ని రూ.లక్షకు పెంచామని తెలిపారు. గతంలో నకిలీ పత్రాలుపెట్టి రూ.4.70కోట్లు రుణాలు తీసుకున్న వారిపై కఠినమైన చర్యలు చేపట్టి రూ.2కోట్లపైగా రికవరీ చేశామని, ఇంకా రూ.2.13కోట్లు బకాయిలున్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ ఘనుకొల్లు రామబ్రహ్మం, డీసీసీబీ సీఈవో ఎన్.వెంకట ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

మధిర రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ఏట్లో కొట్టుకుపోయి వ్యక్తి గల్లంతైన సంఘటన మంగళవారం మధిర మండలం మడుపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పెసరమల్లి వినోద్ మంగళవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు మధిర శివారులోని వైరా నది ఏటి వద్దకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు ఏట్లో దిగి ప్రమాదవశాత్తు ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఏటి వద్దకు చేరుకున్నారు. ఏటి వద్ద కనిపించకపోవడంతో అధికారులకు సమాచారం అందించారు. రాత్రి ఏడున్నర గంటల వరకు గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించ లేదు. గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు వైరా నది ఏరు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుంది. ఈ ధాటికి వినోద్ కొట్టుకుపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేపటి పర్యటన వాయిదా

(5వ పేజీ తరువాయి)

వారం రోజులుగా గ్రామంలో పండుగ వాతావరణం ఉందని, అధికారులు, కూలీలు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారని, కానీ సీఎం పర్యటన వాయిదాతో గ్రామం లో నిశ్శబ్ద వాతావరణం ఉందని వారు అభిప్రాయ పడుతున్నారు. వీలైనంత త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి తమ గ్రామానికి రావాలని వారు కోరుతున్నారు. తమ ఎదురుచూపులు ఫలించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షిస్తున్నారు.



సీఎం పర్యటన వాయిదా విషయాన్ని వెల్లడిస్తున్న విజయ్‌బాబు

వాన మబ్బులు కమ్మిన వేళ...

ఓ వైపు వారం రోజులుగా వానలు విస్తారంగా పడుతున్నాయి. చల్లని గాలులతో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వాన కాస్త తెరిపినివ్వగా. వాన మబ్బులు కమ్మేసిన వేళ.. ఆ మబ్బుల మాటు నుంచి ఎండ చీల్చుకుంటూ వచ్చింది. ఈ దృశ్యం వైరాలో కనిపించింది.

- వైరా, ఆంధ్రజ్యోతి



బోనాల కళ..

సత్తుపల్లి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీఎన్ సెంటనరీ కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించుకున్న శ్రీ పోచమ్మ తల్లి శ్రీ పోతురాజు స్వామి ఆలయం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. అంతకముందు ప్రతిష్ఠాచార్యులు బ్రహ్మశ్రీ రవికుమార్, కాళ్లకూరి విరాట్ ఆచార్య ఆధ్వర్యంలో కాలనీలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా కలసి అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలను సమర్పణ వేడుకలు ఘనం గా నిర్వహించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల న డుమ ఊరేగింపు తరలిరాగా చిన్నాపెద్దా నృత్యాలు చేస్తూ ఆడిపాడటంతో పండుగ వాతావరణం నెలకొంది.



నేడు మణుగూరు ఓసీ విస్తరణపై

ప్రజాభిప్రాయ సేకరణ

» ఏర్పాట్లను పరిశీలించిన ఏరియా జీఎం దుర్గం రామచందర్, డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓపెన్ కాస్టు గని విస్తరణకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ నేడు బుధవారం చేపడుతున్నారు. ఏరియాలోని ఓల్డ్ ఏరియా స్టోర్ మైదానంలో భారీ వేదికను ఏర్పాటు చేశారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్, డీఎస్పీ రవీంద్రరెడ్డి, సీఐ పాటి నాగబాబులు సభా వేదిక అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రస్తుతం మణుగూరు ఓసీ గనికి సంబంధించి బొగ్గు నిక్షేపాలు నిండుకుండటంతో విస్తరణ అనివార్యంగా మారింది. దీంతో సింగరేణి అధికారులు ఇప్పటికే ప్రతిపాధిత విస్తరణ గ్రామాలైన తిర్లాపురం, రామానుజవరం గ్రామాల ప్రజలతో పలుమార్లు సమావేశాలను ఏర్పాటు చేసి సింగరేణి అందజేయనున్న నూతన ప్యాకేజీ వివరాలను వెల్లడి చేశారు. గతం కంటే మెరుగైన నష్టపరిహారాలను చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చే సరికి స్థానిక గ్రామస్థులు కూడా తమ భూములను మణుగూరు ఓసీ విస్తరణకు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలనుంచి వచ్చే సానుకూలత తర్వాత ఫారెస్ట్ పర్యావరణ అనుమతులు గని విస్తరణకు పొందాల్సి ఉంటుంది.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామచందర్


జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మం క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈనెల 20 నుంచి 24 వరకు జరగనున్న 64వ జాతీయస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలకు నగరానికి చెందిన గౌతమ్, గోపీచంద్, మైథిలి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే వారు ఈనెల 3, 4 తేదీలలో హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ షఫీ, కోచ్ గౌస్ తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.


పోటీలకు ఎంపికైన మైథిలి, గౌతమ్, గోపీచంద్

ప్రాణి చిన్నది.. ప్రమాదం పెద్దది

» ఏటా వానాకాలంలో మలేరియా విజృంభణ » ఏజెన్సీ ప్రాంతాల్లోనే కేసుల నమోదు ఎక్కువ » నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం



భద్రాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్య మన్న సూక్తిని నిజం చేయాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో కీలకమని చెప్పక తప్పదు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు దృష్టి సారిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముఖ్యం గా వర్షాకాలంలో ఇది ఎంతో కీలకం కూడా. దీనికి కారణం ఈ సమయంలోనే పరిసరాల అపరిశుభ్రతతో వ్యాధు లు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుంది.. ఈ క్రమంలో ప్రతీ ఒక్కరు తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ పరిశుభ్రతను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా చేపడితేనే వ్యాధులు జ్వరాలకు దూరంగా ఉండే అవకాశం ఉంది. లేదంటే ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

మలేరియా మహమ్మారి 18వ శతాబ్దాన్ని గడగడలాడించింది. అంతుచిక్కని మహమ్మారి అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని 128 ఏళ్ల క్రితం రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త గుర్తించారు. ఆగస్టు 20న రోనాల్డ్‌రాస్ కనుగొనడంతో ప్రపంచ దోమల నివారణ దినోత్సవంగా గుర్తించారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం

ముఖ్యంగా మనకు వ్యాధులు కలుగజేసే దోమలు ఎనాఫిలిస్, ఎడిస్ ఈజిప్టీ, క్యూలెక్స్ దోమలతోనే. ఎనాఫిలిస్ స్టెఫిసీస్, సండైకర్స్ ఎనాఫిలిస్ వలన మలేరియా వ్యాధి, ఎడిస్ ఈజిప్టీ ద్వారా డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు, క్యూలెక్స్ దోమ వలన ఫైలేరియాసిస్ జపనీస్ ఎన్‌సెఫెలైటిస్(మెదడువాపుకు సంబంధించిన వ్యాధి) ఈ వ్యాధులన్నీ సోకేందుకు ప్రధాన కారణం పరిసరాల పరిశుభ్రత లోపించడమే. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయంటే తప్పక దోమలు స్వైర విహారం చేస్తాయి. ఇంట్లో ఉండే కూలర్లలో నీటిని తొలగించకపోయినా, టైర్లు, సీసాల్లో పడిన వర్షపు నీరు రోజుల తరబడి ఉన్నా, తాగిపడవేసిన కొబ్బరి బోండాలు, వాడి పడవేసిన మందు సీసాలు వీటిల్లో మిగిలిపోయిన ద్రవాల్లో దోమలు వృద్ధి చెందుతాయి. ఈ విషయాన్ని సమాజంలో అధిక శాతం మంది నిర్లక్ష్యం చేయడంతో దోమ కాటుకు గురై పైన పేర్కొన్న ఏదో ఒక బారిన పడటం జరుగుతోంది. సహజంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా కేసులు అధికంగా వెలుగుచూస్తూ ఉంటాయి. అయితే ఇటీవల భద్రాచలం ఏజెన్సీలో మలేరియా కేసులు గతంతో పోలిస్తే తగ్గుము ఖం పట్టాయి. కాగా పట్టణాలు, మండల కేంద్రాల్లో తరచూ డెంగ్యూ కేసులు సైతం అధికంగా నమోదు అవుతున్నాయి.

గత ఐదేళ్లలో...

సంవత్సరం	మలేరియా కేసులు
2020	364
2021	355
2022	256
2023	182
2024	095
2025	051

జిల్లాలో నామమాత్రపు కేసులే...!

2030లోపు మలేరియాను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్తుండగా గతంలో కంటే జిల్లాలో మలేరియా పాజిటివ్ కేసులు నామమాత్రంగానే ఉన్నాయని వైద్యాధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 160 గ్రామాల్లో ఇప్పటికే ఒక దఫా మలేరియా రాకుండా దోమల నివారణ కోసం స్ప్రేయింగ్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 207 హాస్టళ్లలో సైతం స్ప్రేయింగ్ నిర్వహించారు. 119 గొత్తికోయల ఆవాసాలు, హైరిస్క్ ప్రాంతాల్లో సైతం స్ప్రేయింగ్ నిర్వహించారు. కాగా జిల్లాలో ఈ ఏడాది 51 కేసులు నమోదయ్యాయి.

వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే. . .

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వర్షాకాలంలో బ్లీచింగ్, సున్నంతో కలిపిన పౌడర్‌ను అపరిశుభ్రత ఉన్న చోట చల్లాలి. అదేవిధంగా ప్రతి ఇంట్లోని అన్ని గదుల్లో ఆల్ఫాసైపర్ మైత్రిన్(ఏసీఎం 5 శాతం) 250 గ్రాముల మందును పది లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అలాగే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కిరోసిన్‌ను చల్లాలి. వీలైతే దోమ తెరలను రాత్రిపూట పడుకునే సమయంలో వినియోగించడం ద్వారా దోమ కాటు నుంచి బయటపడేందుకు వీలుంటుంది. ఏజెన్సీవాసులకు ఈ వ్యాధులు సంక్రమించకుండా ఉండాలంటే వైద్యాధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమదైన రీతిలో సహకారం అందించి గ్రామీణ ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి.

ఖనిజాల బిల్లుపై రాజ్యసభలో మాట్లాడిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో మంగళవారం రాజ్యసభలో గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. ఈమేరకు మైనర్ మినరల్స్ యొక్క ఉపయోగాలు, లాభాలను ఆయన వివరించారు.


మహిళ ఆత్మహత్యాయత్నం

» ఉల్వనూరు లక్ష్మీదేవిపలిలో ఘటన

పాల్వంచ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళపై అసభ్యపదాజాలంతో దూషించడమే కాక ఆమెపై భౌతిక దాడికి ఓ వ్యక్తి పాల్పడటంతో సదరు మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పాల్వంచరూరల్ పోలీసులు మంగళవారం దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 16న మండల పరిధిలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లికి చెందిన రాపోలు రవి అదే గ్రామానికి చెందిన వల్లపు కుమారి ఇంటికి వెళ్లి చేతబడి చేస్తున్నావని ఆరోపిస్తూ, ఆమెను అసభ్య పదజాలంతో దూషించాడు. అంతటితో ఆగకుండా ఆమెపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై గ్రామంలో మరుసటి రోజు పంచాయతీ జరుగుతుండగా, అదే తరహాలో రవి కుమారిని దూషించి దాడికి యత్నించాడు. అందరి ముందూ ఆమెను రవి దుర్భాషలాడటంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లోని పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆహ్లాదంగా కిచెన్ గార్డెన్

» రెబ్బవరం హైస్కూల్‌లో ఆకుకూరల, కూరగాయల తోటలను సాగు చేస్తున్న విద్యార్థులు



వైరా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ కాన్సెప్ట్(హరితదనంపెంపు)లో భాగంగా ఖమ్మంజిల్లా వైరా మండలం రెబ్బవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పెరటితోట(కిచెన్ గార్డెన్)తో ఆహ్లాదాన్ని పంచుతుంది. పాఠశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఈ పెరటి తోటలోని కాయకూరలు, ఆకుకూరలను తరచూ ఉపయోగిస్తున్నారు. పీఎంశ్రీ పథకం కింద రెబ్బవరం హైస్కూల్ ఎంపికైంది. పాఠశాల ఆవరణంలోని సుమారు ఏడుకుంటల భూమిలో చుట్టూ ఇనుప జాలీ ఏర్పాటుచేసి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పెరటితోటను సాగుచేసి నిర్వహిస్తున్నారు. ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడకుండా పాఠశాలలోనే తయారుచేసుకున్న సేంద్రీయ ఎరువుతో ఈ కిచెన్ గార్డెన్‌లో బెండ, గోరుచిక్కుడు కాయలు, గోంగూర, పాలకూర, తోటకూర, సొరకాయ, కరివేపాకు, మునగ రకాలను పండిస్తున్నారు. వీటిని విద్యార్థులకు మధ్యాహ్నభోజనంలో రెండు, మూడురోజులకోసారి వండి వడ్డిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ హైస్కూల్ పదోతరగతి ఫలితాల్లో మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచింది. ఈ ఏడాది టి.మాధురి జిల్లాలో నాల్గోస్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 208మంది విద్యార్థులు విద్యన భ్య సిస్తున్నారు. గత ఏడాది ఈ పాఠశాల కేంద్ర ప్రభు త్వానికి చెందిన పీఎంశ్రీ పథకంలో ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లే వైరా ఎంఈవోగా కొనసాగుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఇంగ్లీష్, తెలుగు ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, వేదన, ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు సుధాకర్ ప్రత్యేక శ్రద్ధతో కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ఆకుల తులసీ, ఉపాధ్యాయులు జి.వెంకట్రావ్, దొడ్డా వరప్రసాద్, లలిత, భవానీ, శ్రీనివాసులు, నర్సింహారావు, మోహ న్‌రావు, భాగ్యలక్ష్మీ, జీవీ.సూర్యప్రకాశరావు, బోధనేతర సిబ్బంది లక్ష్మీ, రామకృష్ణ, మాధవి, శ్రీలత అలాగే ఖాళీ సమయాల్లో విద్యార్థులు కిచెన్ గార్డెన్‌లో కలుపు మొక్కలు తీసి సేంద్రీయ ఎరువులు వేస్తూ తమవంతు తోడ్పాటునందిస్తున్నారు.


మొక్క నాటుతున్న ఎంఈవో వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆందోళనబాటలో ఉద్యోగ సంఘాలు

» 21న బస్‌భవన్ వద్ద ప్రదర్శన
» 23న హైదరాబాద్‌లో ధర్నా
» సెప్టెంబరు 1న ఆందోళన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు దాటినప్పటికీ ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఎలాంటి ఉపయోగం లేక పోగా, పెన్షనర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, తప్పని సరి పరిస్థితుల్లో ఆందోళన బాట పడుతున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. మంత్రులు, అధికారులతో కమిటీలు వేస్తూ కాలయాపన చేయడమే కాకుండా పరోక్షంగా ప్రజల్లో ఉద్యోగుల పట్ల అసంతృప్తి కలిగే విధంగా ప్రకటనలు చేయడంపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాల అమలులోనూ జాప్యం జరుగుతుందని, నెల నెల ఇస్తానన్న పెండింగ్ బకాయిలు ఇంత వరకు కార్యరూపం జరగడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల హెల్త్‌కోసం ఇచ్చిన ఆరోగ్య ట్రస్ట్ హామీ, డీఏలు ప్రస్తావనే లేకపవడం, పదవి విరమణచేసిన ఉద్యోగులకు బకాయిలు 2028లో ఇసామని చెప్పడం, తాము దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు ఇవ్వకపోగా సంవత్సరాల తరబడి కాలయాపన చేయడం వంటి వాటిపై ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు నేరుగా ఆందోళన బాటపడుతున్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నెల 21న హైదరాబాద్ బస్‌భవన్ ముందు ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తోన్నారు. ఆగస్టు 17 తేదీ నుంచి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే పెన్షనర్లు హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించి ఉద్యమానికి బాట వేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘా ల ఆధ్వర్యంలో అంచెలంచెలుగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. కింది స్థాయి ఉద్యోగుల్లో సంఘ నాయకుల పై నమ్మకాలు సన్నగిల్లుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం జేఏసీ నాయకులు ఆందోళనకు పూనుకోవాలని, లేకపోతే కిందిస్థాయి ఉద్యోగులకు తప్పుడు సాం కేతికాలు వెళ్లే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్ మొదటి వారంలో ఆందోళనలు ఉధృతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కార్యచరణ ప్రణాళిక రూపొందించుకున్నాయి.

మొక్కజొన్న పంట ధ్వంసం

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని కూనారంలో రైతులు వేసిన 15ఎకరాల మొక్కజొన్న పంటను గత శనివారం రాత్రి ఫారెస్టు అధికారులు ట్రాక్టర్లతో దున్నేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని మం గళవారం రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 20ఏళ్లుగా ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై ఫారెస్టు అధికారులు కక్ష్యపూరితంగా తమను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని వారు ఆరోపించారు. ఈ విషయమై కొత్తగూడెం ఎఫ్ఆర్వో శ్రీనివాసరావును వివరణ కోరగా భూవివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు రైతులు ఎలా వ్యవసాయం చేస్తారని, కోర్టు పరిధిలో ఉన్న ఈ భూమిలో మొక్కలు నాటడం, వ్యవసాయం చేయడం లాంటి ఎటువంటి పనులు చేపట్టకూడదని తెలిపారు.


ధ్వంసమైన మొక్కజొన్న పంట

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

» ఏన్కూరులో ఘటన


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

ఏన్కూరు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏన్కూరులో జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. ఏన్కూరుకు చెందిన నునావత్ ప్రేమ్‌కుమార్ (35) జూలూరుపాడులో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. రోజులాగానే పని ముగించుకొని సోమవారం రాత్రి ఏన్కూరులోని సొంత ఇంటిలో నిద్రించాడు. కాగా పిల్లల చదువుకోసం అతడి భార్య వారితో కలిసి ఖమ్మంలో ఉంటుంది. అప్పుడప్పుడు అతడు పిల్లల దగ్గరకు వచ్చి వెళ్తుండేవాడు. కాగా ఒంటరిగా ఉన్న ప్రేమ్‌కుమార్ మంగళవారం ఉదయం భార్యకు వీడియోకాల్ చేసి మట్లాడాడు. ఆతర్వాత కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి తాను ఉరేసుకుని చనిపోతున్నట్టు తెలిపాడు. వెంటనే డ్రైవర్ వచ్చి చూసేసరికి ఇంటిలో గడిపెట్టుకుని ఉరేసుకున్నాడు. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య గీత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కరెంటుతో చేపలు పడుతూ వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కరెంట్‌తో చేపలు పడుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈసంఘటన మండల పరిధిలోని అనంతసాగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసాగర్ గ్రామానికి చెందిన డేగల భాస్కర్‌రావు(39) ఉదయం గ్రామ శివారులో గల తన పొలంలో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటారుకు అమర్చిన కరెంటు వైరును ఉపయోగించి పక్కనే ఉన్న ఊట వాగులో చేపలు పట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోవడంతో కరెంటు షాక్ గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన సమీప రైతులు బాధితుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. భార్య డేగల రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానన్నాడు.. ఆపై అనుమానించాడు

» మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం » చికిత్స పొందుతూ మృతి
» టేకులపల్లి మండలం వెంకట్యాతండాలో ఘటన


తులికశ్రీ(ఫైల్)

టేకులపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దలు కుదిర్చిన సంబంధం. తనతో పెళ్లికి ఓకే అన్న ఆ యువకుడు కొద్దిరోజులకు తనను అనుమానించడంతో పాటు పెళ్లి చేసుకోనని చెప్పడంతో ఆ యువతి పురుగుల మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కొత్తతండా(జీ)పంచాయతీ పరిధిలోని వెంకట్యాతండాలో మంగళవారం జరిగింది. వెంకట్యాతండాకు చెందిన గుగులోతు వీరమోహన్, బుజ్జి దంపతుల కుమార్తె బీటెక్ సెకండియర్ చదువుతున్న తులికశ్రీ(19)కి లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఎయిర్‌ఫోర్సు ఉద్యోగిగా పనిచేస్తున్న బానోతు బిచ్చాతో వివాహం చేసేందుకు ఇరుకుటుంబాలు చర్చించుకున్నాయి. ఈ క్రమంలో బిచ్చ ఇటీవల వెంకట్యాతండాకు వచ్చి తులిక శ్రీ తనకు నచ్చిందని, పెళ్లి చేసుకుంటానని తులికశ్రీ తల్లిదండ్రులు చెప్పాడు. తులికశ్రీని తనతో భద్రాచలం పంపాలని కోరగా.. కాబోయే అల్లుడే కదా అని అందుకు యువతి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు. దాంతో తులికశ్రీని తన వెంట తీసుకెళ్లిన బిచ్చా తిరిగి ఆమెను ఇంటివద్ద దించివెళ్లాడు. ఆ తర్వాత ఫోన్లు చేసి 'నువ్వు బీటెక్ చదువుతున్న మరో అబ్బాయితో ఫోన్‌చాటింగ్‌లు చేస్తున్నావు. నిన్ను పెళ్లి చేసుకోను. ఏం చేసుకుంటావో చేసుకో.. కావాలంటే చచ్చిపో' అని ఫోన్ కాల్స్, చాటింగ్ ద్వారా ఆమెను బిచ్చా అనుమానించడం, ఇబ్బందులకు గురిచేయడం లాంటివి చేశాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన తులికశ్రీ ఈ నెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ రాజేందర్‌తెలిపారు.

రెండు నెలల్లో 114గంజాయి బ్యాచ్‌ల అరెస్టు: ఏసీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యంపానం, ర్యాష్‌డ్రైవింగ్, రాత్రిసమయాల్లో సమయంకు మించిషాసులు తెరవడం రోడ్లపై పుట్టినరోజు వంటి వేడుకలు చేస్తే సిటీ పోలీసు యాక్టు కింద కేసులు నమోదుచేస్తామని టౌన్ ఏసీపీ రమణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోరీ కేసులు ఛేదించేందుకు ప్రత్యేకంగా 3పోలీసు బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈఏడాది జులై, ఆగస్టు నెలలో ఖమ్మం డివిజన్‌లో 38గంజాయి కేసులు నమోదుచేసి 167మంది గంజాయి బ్యాచ్‌లను గుర్తించి 114మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి నుంచి రూ.11లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో 24,25 తేదీల్లో రక్తదాన శిబిరం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితులకు అండగా నిలిచేందుకు ఈనెల 24,25తేదీల్లో ఖమ్మంలో బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు రాజయోగిని బ్రహ్మకుమారి అధిపతి ఖమ్మం ఇన్‌చార్జి బీకేఅరుణ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మంలోని కస్బాబజార్ రామాలయం ఆలయం సమీపంలో ఉన్న బ్రహ్మకుమారీల సంస్థ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారిలు గీత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎఫ్ఆర్ఎస్ హాజరును పక్కాగా నమోదు చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

విద్యాశాఖ అధికారులతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు పక్కాగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు నమోదుపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. భవిత కేంద్రాల మరమ్మత్తు అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకొని, ఫాలోఅప్ చేస్తూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, ఉపాధ్యాయులకు సెలవు మంజూరులో ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపుకలెక్టర్, ఇందిరా మహిళా డైయిరీ గ్రౌండింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇందిరా మహిళా డైయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ఒక్కో లబ్ధిదారుకు 2పాడిపశువుల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. పాడిపశువుల కొనుగోలు కోసం కమిటీ ఏర్పాటు చేశామని, కొనుగోలు, రవాణా, బీమాసౌకర్యం కల్పన,తదితర అంశాలలో పాటించాల్సిన విధానాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఎంపీడీవోలు,బ్యాంకుఅధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల నిర్వహణ బావుండాలి

గ్రంథాలయాలనిర్వహణ సక్రమంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన గ్రంథాలయసంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. 2025-26 వార్షిక బడ్జెట్ ఆమోదం, నేలకొండపల్లిలో భవన నిర్మాణం, జిల్లా కేంద్రగ్రంథాలయంలో అదనపు నూతన భవన నిర్మాణం, పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలు వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ ఏడాది నేలకొండపల్లిలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.22.60లక్షలు టీఎస్ ఈడబ్ల్యూఐడీసీకి చెల్లించేందుకు పౌర గ్రంథాలయ అధికారులకు ప్రతిపాదనలు అందచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి కె.కరుణ, వయోజన విద్య డీడీ అనిల్, డీఈవో నాగపద్మజ, డీపీవో ఆశాలత, అదనపు పౌరసంబంధాల అధికారి ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

12 లోపు సీఎంఆర్ రైస్ అందజేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ రైస్ డెలివరీ సెప్టెంబరు12లోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్, సీఎంఆర్ రైస్‌డెలివరీపై మంగళవారం సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. వానాకాలం పంటకు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ గడువు ప్రభుత్వం నెల రోజులపాటు పొడిగించిందని సెప్టెంబరు12 వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 14శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మార్పులు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగులో ఉన్న రైస్ డెలివరీపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్‌రావు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య అందని ద్రాక్షేనా?

- కూసుమంచి హైస్కూల్‌లో అలంకారప్రాయంగా కంప్యూటర్లు
- 25 కంప్యూటర్లు ఉన్నా.. ఇన్‌స్ట్రక్టర్ లేక నిరుపయోగం


కూసుమంచి ఉన్నత పాఠశాలలో అలంకారప్రాయంగా కంప్యూటర్లు

కూసుమంచి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పోటీప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయిలో విద్యఅందించేందుకు కంప్యూటర్ విద్య ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ఆయా బడులకు కేటాయించిన కంప్యూటర్లు మూలనపడ్డాయి. బోధకులు లేకపోవడంతో కంప్యూటర్ విద్య మిథ్యే అవుతోంది. మండల కేంద్రమైన కూసుమంచి ఉన్నతపాఠశాలలో సుమారు 850 మంది విద్యార్థులున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' సందర్శించగా కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం, దాతల సహకారంతో..

కేంద్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికవిద్య పెంపొందించేందుకు కూసుమంచి ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం 15 కంప్యూటర్లు అందించింది. దీనికి కొందరు దాతలు ముందుకొచ్చారు. ఎన్నారై ఒకరు 10 కంప్యూటర్లు అందించారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్‌రైజింగ్‌ఇండియా (పీఎంశ్రీ) పథకం ద్వారా 14కంప్యూటర్లు, సమగ్రశిక్ష ద్వారా కంప్యూటర్ అందించింది. ఇక్కడ పనిచేసిన ఒక ఉపాధ్యాయురాలు తమ బంధువు ఎన్ఆర్ఐ ద్వారా 10కంప్యూటర్లు అందించారు. మొత్తం మీద 25 కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఉన్నాయి. అయితే కంప్యూటర్ విద్య బోధించేందుకు బోధకులను ప్రభుత్వం నియమించలేదు. దీంతో లక్షల విలువచేసే కంప్యూటర్లు, సీపీయులు నిరుపయోగంగా మారాయి. కంప్యూటర్ బోధకుల నియామకంపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించకపోవడంతో నిరుపయోగంగా మారాయి ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సాంకేతికవిద్య ప్రారంభించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

మంత్రి పొంగులేటి హామీ

కూసుమంచి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధించేందుకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించి వేతనాలు ఇచ్చేందుకు రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసేందుకు వచ్చిన మంత్రి దృష్టికి హెచ్ఎం వీరాస్వామి తీసుకొచ్చారు.అందుకుసానుకూలంగా స్పందించిన మంత్రి.. ఇన్‌స్ట్రక్టర్‌లకు అయ్యే ఖర్చు రూ.3లక్షలు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమకూర్చేందుకు హామీ ఇచ్చారు.

త్వరలో కంప్యూటర్ విద్య అందిస్తాం

వీరస్వామి హెచ్ఎం, కూసుమంచి

పాఠశాలలో కంప్యూటర్లు, ఇతరసామగ్రి ఉన్నాయి. ఉపాధ్యాయుడిని నియమించాల్సి ఉంది. సాంకేతిక విద్యపట్ల ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి బోధకుల నియామకం ప్రస్తుతం లేనందున మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన మంత్రి నిధులు సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం ఇన్‌స్ట్రక్టర్లను నియామకం చేసే పనిలో ఉన్నాం. త్వరలో నియామకం పూర్తి చేసి విద్యార్థులకు సాంకేతికవిద్య అందించేందుకు కృషి చేస్తాం.

నేడు ఇండోర్ స్టడీ టూర్‌కు కేఎంసీ పాలకవర్గం

- 75మంది వెళ్లేందుకు ఏర్పాట్లు
- వర్షాల వేళ అదనంగా మరోరోజు పర్యటన

ఖమ్మంకార్పోరేషన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక వర్గం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ పట్టణానికి బుధవారం వెళ్తున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ కార్పొరేటర్లు భారీగానే పేర్లు నమోదు చేయించారు. ఐదేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భారతదేశంలో నెంబర్ 1 స్థానం ఇండోర్ దక్కించుకుంటోంది. అక్కడ పారిశుధ్యం, పరిశుభ్రత, ప్లాస్టిక్ రహితం, బయోగ్యాస్ ప్లాంట్, కార్మికుల నిర్వాహణ, ఇతర అంశాలను పరిశీలించనున్నారు. కాగా మరో 9నెలల్లో ఖమ్మం నగర పాలక వర్గం పదవీకాలం ముగుస్తుండటంతో స్టడీటూర్‌కు వెళ్లేందుకు కార్పొరేటర్లు మక్కువ చూపారు. కార్పొరేటర్లతో పాటుగా వారికి తోడుగా మహిళా కార్పొరేటర్లకు వారి భర్త, పురుష కార్పొరేటర్లు వెంట వారి భార్యలకు అవకాశం కల్పించారు. అయితే కార్పొరేటర్లు కానీ వారు మాత్రం సొంతగా డబ్బులు పెట్టు కోవాల్సి ఉంటుంది. బుధవారం ఉదయం ఖమ్మంలో బయలుదేరి హైదరాబాద్‌కు బస్సులో వెళ్లి అక్కడ నుంచి ఇండోర్‌కు విమానంలో వెళ్లనున్నారు.

ఒకరోజు పొడిగింపు

ఈనెల 25వరకు భారీ వర్షాలు ఉన్నాయని తెలంగాణ వాతావరణశాఖ అధికారులు ముందస్తు సంకేతాలు ఇచ్చారు. గత ఆదివారం మున్నేరు అధికారులను హడలెత్తించింది. అయితే ఖమ్మంనగర పాలక సంస్థ పాలకవర్గం ఈటూర్ ఈనెల21 నుంచి23 వరకు ముందుగా షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే కొంతమంది కార్పొరేటర్లు మరోరోజు అదనంగా కావాలని కోరటంతో ఈనెల20 నుంచి23 వరకు పర్యటన ఒక రోజు పొడిగించారు. భారీ వర్షాలపై హెచ్చరికలు ఉన్న రోజుల్లోనే టూర్ వెళ్లటంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కార్పొరేటర్ రావూరి


ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కరుణ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు తొలివిడత రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు. పుట్టకోటలో ఇంటింటికి వెళ్లి వీటిని అందజేశారు. ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. నాయకులు రెడ్డిబోయిన కోటేశ్వరరావు, సోమగాని నర్సింహారావు, శంకర్, ఎరుకలబోయిన ఉపేందర్, మన్నే సత్యానారాయణ, రెడ్డిబోయిన వెంకన్న, డీలరు వీరయ్య పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ఐక్యఉద్యమాలు

- సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ఐక్యఉద్యమాల ద్వారానే గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణ సాధ్యమని, ప్రభుత్వాలు గ్రానైట్ పరిశ్రమను ఆదుకునేందుకు సహకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, టీజీఎస్ఎఫ్ గ్రానైట్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు యుగంధర్, కమర్తపు గోపాలరావు పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో తమ్మినేని కొటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. గ్రానైట్‌పై పెంచిన రాయల్టీ, పర్మిట, సీనరేస్‌చార్జీలను ఉపసంహరించాలని కోరారు. 12ఏళ్లుగా ప్రభుత్వం నుంచి రూ.20కోట్ల సబ్సిడీలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రానైట్ ఉత్పత్తులపై ఉన్న జీఎస్టీని 18శాతం నుంచి 5శాతానికి తగ్గించాలని కోరారు. ఐదుహెక్టార్లులోపు క్వారీలకు ఎన్విరాన్‌మెంట్ నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఉప్పలపాటి వెంకటరమణ, పారా నాగేశ్వరరావు, నర్సింహారావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, జీ రామయ్య, రాజారావు, వై విక్రమ్, విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైయినేజీలు శుభ్రంగా ఉండాలి: మేయర్



ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగరంలో డ్రైయినేజీ వ్యవస్థ శుభ్రంగా ఉండాలని, తద్వారా వర్షపు నీరు మురు గు నీరు సజావుగా వెళ్లి పోతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం పాతబస్టాండ్ సమీపంలో డ్రైయినేజీల పూడికతీతను పరిశీలించారు. ప్రధాన డ్రైయినేజీల్లో వ్యర్థాలు నిల్వ ఉండి నీరు ప్రవహించక పోవటంతో వాటిని జేసీబీలతో శుభ్రం చేశారు. ఆయా పనులను మేయర్ పరిశీలించారు.

18వ డివిజన్‌లో కమిషనర్ పర్యాటన

నగరంలోని 18వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. నూతనంగా నిర్మాణం చేసిన డ్రైయినేజీలను తనిఖీలు చేశారు. మురుగు నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు.

కందాళ ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారం గ్రామానికిచెందిన వీరబోయిన త్రివేణికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. త్రివేణి మహాత్మజ్యోతిరావుపూలే కళాశాలలో ఇంటర్‌లో 982 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి కందాళ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించారు. నీట్ కోచింగ్‌కు ఖర్చు భరిస్తానని చెప్పారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. మంగళవారం తిరుమలాయపాలెంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు.

ఖిల్లా రోప్‌వేకు లైన్ క్లియర్!

- 9మందికి పరిహారం చెల్లింపు
- రెండు భవనాల తొలగింపునకు చర్యలు చేపట్టిన కేఎంసీ


భవనాన్ని కూల్చిన అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంఖిల్లా రోప్‌వేకు లైన్ క్లియర్ అయింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరాన్ని సుందరీకరణకు దశాబ్దాలుగా చర్యలు తీసుకున్నారు. లకారం ట్యాంకు బండ్ నుంచి ఖమ్మం అర్బన్ పార్కు,పరిరక్షణ,అభివృద్ధి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఇటీవల ఖిల్లా నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు రోప్‌వే నిర్మాణానికి కార్యచరణ చేశారు. ఈ క్రమంలోనే రోప్‌వే నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 9కుటుంబాలకు పరిహారం చెల్లించారు. వారిలో రెండు కుటుంబాల భవనాలు ఉండటంతో వారికి ఇతర ప్రాంతాల్లో స్థలాలను కేటాయించారు. మిగిలిన వారికి పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనల మేరకు ఖమ్మం నగర పట్టణ ప్రణాళిక అధికారులు ఖిల్లాపై ఉన్న రెండు భవనాలు తొలగింపు చర్యలను మంగళవారం చేపట్టారు. దీంతో రోప్‌వేకు లైన్ క్లీయర్ జరిగింది.

పూల విక్రయదారులను చిరు వ్యాపారులుగా గుర్తించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నగరంలో పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారిని చిరు వ్యాపారులుగా ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సహకారం అందించాలని ఖమ్మం టౌన్ ఫ్లవర్స్ అసోషియేషన్ నాయకులు కోరారు. మంగళవారం నగరంలోని పీఆర్టీయూ భవన్‌లో ఖమ్మం టౌన్ ఫ్లవర్స్ అసోషియేషన్ నగర సభ నిర్వహించారు. అనంతరం టౌన్‌నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా షేక్. మహిమూద్, సర్దార్, శ్రీను, ప్రెసిడెంట్‌గా షేక్. మోయిన్, ఎం.రామకృష్ణ, సెక్రటరీగా షేక్. ఖాజాతో పాటు పూర్తి స్థాయి కమిటిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారిలో చాలా వరకు ఇళ్లు లేని నిరుపేదలేనని ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని వారు విన్నవించారు. పూల అమ్ముకుంటున్న వ్యాపారులకు నూతన కమిటీ ఎళ్లవేళ్లలా అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తుందని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరంలో పూలు అమ్ముకుంటున్న 200 వందల మంది పూల విక్రయదారులు పాల్గొన్నారు.

ఆశాల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి


నేలకొండపల్లి పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

నేలకొండపల్లి,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఆశావర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. ధర్నా నుద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనాలివ్వటంలో సైతం ప్రభుత్వం విఫలమైందన్నారు. నెలకు రూ.18వేలివ్వాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని, ఆదివారంతో పాటుగా ముఖ్యమైన పండుగలకు సెలవులివ్వాలని రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి భూక్యా విజయ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న పోలీసులు

తిరుమలాయపాలెం,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బానోతు ఉపేందర్‌కు పోలీసులు ఆర్థిక సాయం అందించారు. ఉపేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో ఉపేందర్ కుటుంబానికి రూ.లక్ష అందించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర రైతుసంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. మండల పరిధిలోని తల్లంపాడు, నరసింహపురం గ్రామాల్లో నష్టపోయిన పంటలను మంగళవారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు.ఈకర్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏలూరి భాస్కరరావు, బానోతు రాంకోటి, పాల్తియా శ్రీను, ధనమూర్తి పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి:రైతుసంఘం

కూసుమంచి: రైతులకు యూరియా కొరత తీర్చాలని సీపీఎం రైతుసంఘం మండల కార్యదర్శి తోటకూరి రాజు, రైతుసంఘం మండల అధ్యక్షకార్యదర్శులు యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈమేరకు ఏవోకు వినతిపత్రం అందించారు. మండలంలో ఫెర్టిలైజర్ వ్యాపారులు యూరియాకు ఇతర మందులు లింక్‌పెడుతున్నారని, కృత్రిమకొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

కృష్ణయ్యకు బీఆర్ఎస్ నాయకుల నివాళి



ఖమ్మంమార్కెట్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో మృతి చెందిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వదిన జయశ్రీ తండ్రి బొందలపాటి క్రిష్ణయ్య మృతదేహానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. మంగళవారం శ్రీనగర్‌కాలనీలో కృష్ణయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కర్నాటి క్రిష్ణ, మక్బూల్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తులమురళి, రవికిరణ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు నివాళలర్పించారు.

విషజ్వరాలపై దృష్టి సారించండి: నెల్లూరి

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విషజ్వరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యాశాఖ అధికారి కళావతిబాయికి మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ప్రజలు ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. వైద్యారోగ్యాశాఖ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు గంటేల విద్యాసాగర్ అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నల్లగట్టు ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆశాల ధర్నా

తల్లాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నందున ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నిత్యం వెట్టిచాకిరి చేస్తున్న తమకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు తాళ్ల రాణి, నీలిమ, కృష్ణకుమారి, ధనలక్ష్మి, దేవకరుణ, ఉమ, వెంకటమ్మ, జ్యోతిపాల్గొన్నారు.

కల్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ కల్లూరులో ఆశా కార్యకర్తలు (సీఐటీయూ అనుబంధం) మంగళవారం విధులను బహిష్కరించి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆశా కార్యకర్తల సంఘం నాయకురాలు గద్దల సమాధానం ప్రసంగిస్తూ పని భారానికి తగినట్లుగా కనీస వేతనం రూ.18 వేలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరగా, మరో వైపున నెలవారిగా అందించాల్సిన పారితోషకాన్ని నిలిపివేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమ సేవల్లో భాగంగా ప్రతి రోజు క్షేత్రస్థాయి సందర్శనలు, గర్భిణీల కాన్పులు, పారిశుధ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నివారణలో సేవలందించడం వంటి తదితర సేవలు అందిస్తున్నామని చెప్పారు. కాన్పుల విషయంలో పేషెంట్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకోకుని వెళ్తే రాత్రి పూట కూడా అక్కడ జాగారం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం రెగులర్ చేయడంతోపాటు సమానంగా వేతనాలు అందించాలని సమాధానం ప్రభుత్వాన్ని కోరారు. అరకొర వేతనాలతో తమ కుటుంబ జీవనం ఆర్థిక భారంగా మారిందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐతోపాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని వారు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆశాల కార్యకర్తల సంఘం నాయకులు వసంత, కాటమ్మ, కామేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

బోనకల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, రూ. 18వేల వేతనాన్ని అందించాలని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యాభివృద్ధిలో బాగంగా ప్రతి పనిని తాము క్షేత్ర స్థాయిలో చేస్తున్నందున తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కారేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జూలై నెల పెండింగ్ వేతనం చెల్లించాలని, ఆశవర్కర్లకు నెలవారి వేతనం 18వేలు చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న మండల కన్వీనర్ నరేందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, హామీ ప్రకారం వేతానాలు చెల్లించాలన్నారు. అనంతరం వైద్యుడు సురేష్ కు వినతిపత్రం అందచేశారు.



తల్లాడ పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు



బోనకల్‌లో..



కారేపల్లిలో..



కల్లూరులో..

చలో ప్రజాభవన్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అమర్లపూడి శరత్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈనెల 22న తలపెట్టిన ఛలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పీఎస్‌సీడబ్ల్యూయూ) కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలో కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన గ్రూప్ మీటింగ్‌లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచలేదని, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు చాలా చోట్ల పీఎఫ్‌లు అందించడం లేదని, వేతనాలు సక్రంగా ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో బీ.రమేష్, ఎం.రవి, శ్రీలక్ష్మీ, రాణి, జయమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపంతో ఎరువుల కొరత ఏర్పడిందని, యూరియా నిల్వలు రైతాంగానికి శాపంగా మారాయని పీఏసీఎస్ డైరెక్టర్, టీడీపీ మండల కన్వీనర్ బొంతు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఒక్కో కేంద్రం వద్ద సుమారు 600ల మంది రైతులు వేచి ఉండగా ఎక్కడా కూడా కనీసం 200బస్తాలు అందుబాటులో లేవని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి సరిపడా అందించాలని డిమాండ్ చేశారు.

ముదిగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియాను అవసరం మేరకే వినియోగించుకోవాలని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సూచించారు. ఇప్పటికీ ముదిగొండ సొసైటీకి 603మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా కోసం కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

తల్లాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క యూరియా బస్తా కోసం ఒక్కో రైతు రెండు రోజులపాటు సొసైటీ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తలు కూడా క్యూలో నిలబడి ఫింగర్ ప్రింట్ చేస్తేనే యూరియా పంపిణీ చేయడం జరుగుతుందనే నిబంధనతో క్యూలో మహిళలు గంటల తరబడి నిలబడి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని బీజేపీ జిల్లా నాయకుడు అపతి వెంకటరామారావు, గాదే కృష్ణారావులు చరవాణి ద్వారా సత్తుపల్లి ఏడీఏ, తహసీల్దార్, ఏవోల దృష్టికి తీసుకెళ్లి మహిళలకు నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు, వరిసాగుకు సరిపడా యూరియా సరఫరాచేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

ఏన్కూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం తిమ్మరావుపేట కేంద్రంగా యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం తిమ్మరావుపేట గ్రామంలో కలసాని సాయి అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏన్కూరు మండలం మొత్తం ఒకే సొసైటీ ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి ఇబ్బంది పడుతూ రైతులు రావాల్సి వస్తుందన్నారు. గిరిజన గ్రామాలకు కూడలిగా ఉన్న తిమ్మరావుపేటలో పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి గిరిజన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం గ్రామ అధ్యక్షుడు కాట్రాల బిక్షం, కార్యదర్శి సంజీవరావు, కాకాని కోటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో క్యూలో ఉన్న మహిళలు

సరిపడా నిల్వలు ఉన్నాయి

- ఏడీఏ స్వర్ణ విజయచంద్ర

చింతకాని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు తగిన యూరియా జిల్లాలో ఉందని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో యూరియా పంపిణీను ఆయన పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు యూరియాను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు చింతకాని సొసైటీ ద్వారా 320 టన్నులు యూరియాను రైతులకు ఇచ్చామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మరింత యూరియాను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరాలో ఈద్గాకు ఎకరం స్థలం కేటాయింపు

వైరా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈద్గా కోసం ఎకరం స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించగా ఆ స్థలాన్ని మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సందర్శించి పరిశీలించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని ముస్లింలు రంజాన్ ఇతర పండుగల సమయాల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం తమకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన ముస్లింలకు అవసరమైన ఈద్గాకు స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దాంతో రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలో ఈద్గా కోసం రెవెన్యూ అధికారులు ఒక ఎకరం స్థలాన్ని కేటాయించారు. ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ చింతా వేణుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని కేటాయింపు చేసిన ఎమ్మెల్యేకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. వైరా, కొణిజర్ల మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, ఏదునూరి సీతరాములు, వేముల కృష్ణప్రసాద్, దాసరి దానియేలు, పమ్మి అశోక్, ఆది ఆనందరావు, షేక్.సోందుసాహెబ్, బాబూజానీ, కౌసర్, మీరా పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చంద్రమౌళీశ్వరాలయ పాలకవర్గం ఎన్నిక

ఎర్రుపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెం శ్రీబాల త్రిపురసుందరీ సహిత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆ ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం మంగళవారం దేవాయదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా మగినం జయశ్రీతోపాటు సభ్యులుగా ఆజా జగన్నాథ కృష్ణ, దూదిగం ఫకీరయ్య, భవనం వెంకటప్పారెడ్డి, దేవరకొండ లక్ష్మణ్‌రావులను ఆలయ ఈవో రామకోటేశ్వరరావు ప్రమాణం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడుగా అర్చకుడు ఎనర్.గోపాలకృష్ణ శర్మను నియమించారు. తమపై నమ్మకం ఉంచి ఆలయ పాలకవర్గం బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, గ్రామపెద్దలకు ఎన్నికైన వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు, మండల కాంగ్రెస అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు చావా రామకష్ణ, శీలం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు, షేక్ ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, వెంకటనరసయ్య, బాబురావు, దేవరకొండ శ్రీను పాల్గొన్నారు.



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

పెసర రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన పెసరసాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కోరారు. మంగళవారం భారీ వర్షాలతో దెబ్బతిన్న పెసరపంటలను రైతుసంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు పెసరరైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు బీమా పథకాన్ని వర్తింపచేసి ఆదుకోవాలని కోరారు.నాయకులు స్వర్ణ రమేష్, తండు సోమయ్య, తోటపల్లి సీతరాములు, కొమ్మినేని వెంకయ్య, తుప్పతి వెంకటేశ్వర్లు, వెంకటాద్రి, వజీర్, కిషన్ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న దొండపాటి

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

పెనుబల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రూపస్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం ఎంఈవో సత్యనారాయణ విచారణ జరిపారు. వావిళ్లపాడు గ్రామానికి చెందిన గుంజా వెంకటనారాయణ తన కుమారుడు వాసుదేవ్ పదో తరగతి చదువుతుండగా తన చిన్న కుమారుడికి ఆరోగ్యం సరిగా లేక పరామర్శించేందుకు పల్లిపాడు గ్రామం వెళ్లి తిరిగి వస్తూ ఆదర్శ పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపల్ రూపస్ తన కుమారుడిని ఆలస్యంగా ఎందుకొచ్చావంటూ తిట్టాడని, బయటకు పో అంటూ మెడపట్టుకొని నెట్టాడని, తన కుమారుడికి టీసీ ఇచ్చి పంపిస్తామని కుమారుడి చదువుకు అంతరాయం కల్గించినట్లు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎంఈవో సత్యనారాయణ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్‌తోపాటు విద్యార్థులను కూడా విచారించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీంతోపాటు ఇదే పాఠశాల ప్రిన్సిపల్ రూపస్‌పై జిల్లా కలెక్టర్‌కు ఈనెల 13న టేకులపల్లికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ పేరుతో నైట్‌వాచ్‌మెన్‌గా అదే సత్యనారాయణకు హాజరు వేయించి 30రోజుల జీతం కోసం వీరికి డబ్బులు చెల్లించే ఏజెన్సీకి పంపించారని, పాఠశాలకు మద్యం సేవించి హాజరవుతున్నాడని తదితర అంశాలతో కూడిన ఫిర్యాదును కలెక్టర్‌కు అందజేశారు. వీటిపై సత్వరలోనే విచారణ జరుపుతామని ఎంఈవో తెలిపారు.



పాఠశాలలో విచారిస్తున్న ఎంఈవో

ప్రముఖ విద్యావేత్త దుగ్గినేని మృతి

- గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా సుపరిచితులు



మధిర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దుగ్గినేని సత్యనారాయణ(90) నిన్న రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ తన ప్రాథమిక విద్యను ఇల్లూరులో పూర్తి చేసి అనంతరం మధిర టీవీఎం పాఠశాలలో హెచ్‌ఎస్సీ పూర్తి చేశారు. 1955లో సంగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరి అనంతరం 1958 లో తాను విద్యనభ్యసించిన టీవీఎం పాఠశాల కు ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పని చేసిన ఆయన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాడారు. 1983 లో రాష్ట్రపతి చేతులు మీదగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న సత్యనారాయణ పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ హైస్కూల్‌తో పాటు పలు ప్రముఖ విద్యా సంస్థలకు ప్రిన్సిపల్‌గా పని చేశారు. 2002 లో చేకూరి కాశయ్య, ఎస్.వి. నారాయణతో కలిసి ఖమ్మం లో గురుదక్షిణ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఇల్లూరు, ఖమ్మంపాడు మధ్య వైరా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఆయన కృషి చేశారు, దాని శంకుస్థాపన కార్యక్రమానికి కూడా ఆయన నాటి మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే భట్టి విక్రమార్కతో కలిసి హాజరయ్యారు. సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు కుమారుడు అమెరికాలో స్థిరపడగా హైదరాబాద్‌లోనే డాక్టర్ అయిన తన చిన్న కుమార్తె ఇంట్లో ఉంటూ సోమవారం రాత్రి వృద్ధాప్యంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో మరిణించారు. ఆయన పార్థీవదేహాన్ని హైదరాబాద్ లోని మమత హస్పటల్‌కు వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కుటుంబ సభ్యులు అందజేశారు, ఆయన సతీమణి రెండు సంవత్సరాల క్రితం మరణించగా ఆమె పార్థీవ దేహాన్ని కూడా మమత హస్పటల్‌కే అందజేశారు. సత్యనారాయణ మృతికి ఇల్లూరు గ్రామస్థులతో పాటు మధిర టీవీఎం పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు, గురుదక్షిణ ఫౌండేషన్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

బ్రాహ్మణ సంఘంలో సత్తుపల్లికి ప్రాధాన్యం

సత్తుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘంలో సత్తుపల్లి ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆసంఘ రాష్ట్ర మహిళ నూతన ఉపాధ్యక్షురాలు తేరాల వాణీ అన్నారు. మంగళవారం వరంగల్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘ రాష్ట్ర మహిళ నూతన ఉపాధ్యక్షురాలు తేరాల వాణీ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొడిమెల అప్పారావు, ఊటుకూరు వినోదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మాదిరాజు పుల్లారావు, రాష్ట్ర లీగల్ అడ్వయిజర్‌గా కొండపల్లి విజయకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర చైర్మన్ అధ్యక్షుడు మోదుకూరి రాము, రాష్ట్ర చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహనశర్మతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు.



పత్తిరైతు ఆశలను ఆవిరి చేసిన వరద

- ఏరు ఉధృతికి తీరని నష్టం
- కన్నీళ్లే మిగిలాయంటున్న రైతు

కొణిజర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు విలవిలలాడుతున్నారు. వాగులు, ఏరుల కింద పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొణిజర్ల మండలం క్రాంతినగర్‌కు చెందిన భూక్యా సురేష్ మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామంలో ఓ రైతుకు చెందిన ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తిసాగు చేశాడు. పత్తి పూత, కాయ దశకు చేరుకుంది. పంట బాగా పండుతుందని ఆశపడిన ఆ రైతుకు భారీ వర్షాలు శాపంగా మారాయి. రైతు సాగు చేసిన పత్తి పంట ఏరుకు దగ్గరలో ఉండడంతో ఏరు పొంగి వరద మొత్తం రైతు చేలోనే పారింది. దాంతో చేతికొచ్చిన పంట మొత్తం నీళ్లలో మునిగి నల్లబారి కుళ్లిపోయింది. సాగు చేసిన ఎనిమిది ఎకరాల్లో సుమారు ఏడు ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నది. దాంతో యువకౌలు రైతు దుఃఖంతో కుంగిపోయాడు. ఎంతో ఆశతో పత్తి పంటవేస్తే వర్షాలతో వరద మొత్తం చేనుపై పడి నిలువున నష్టపోయానని రైతు లబోదిబోమంటున్నాడు. ఇప్పటి వరకు పెట్టుబడులు మొత్తం సుమారు రెండు లక్షలు అయ్యాయని రైతు వాపోయాడు. ఇదే రైతు సురేష్ తండ్రి మంగీలాల్ కూడ ఎనిమిది ఎకరాల్లో పత్తిని సాగు చేయగా మూడు ఎకరాల్లో పత్తి పూర్తిగా దెబ్బతిన్నది. తండ్రికొడుకులకు వ్యవసాయం శాపంగా మారిందని స్థానికులు జాలిపడుతున్నారు.

పూర్తిగా నష్టపోయా: రైతు భూక్యా సురేష్

ఎనిమిది ఎకరాల్లో పత్తి ఎంతో మంచిగా ఉంది. కాపుకు వచ్చింది. పెట్టుబడులు మొత్తం పోను లాభాలు వస్తాయని ఆశపడ్డా. భారీ వర్షాలకు వరదమొత్తం చేనుమీద పారింది. పంట మొత్తం మునిగిపోయి పూర్తిగా కుళ్లి నల్లబారి పనికిరాకుండ పోయింది. ఎనిమిది ఎకరాలు ఎకరానికి రూ. 30వేలు చొప్పున కౌలుకు తీసుకుని సాగు చేస్తే చివరకు ఎకరం మాత్రమే పంట మిగిలింది. ఏడు ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నది. లక్షలాది రూపాయల పెట్టుబడులు నీళ్ళపాలు అయ్యాయి. సెంటుభూమిలేకపోయిన వ్యవసాయం మీద ప్రేమతో కౌలుకు తీసుకుని సాగుచేశా. నిలువున నష్టపోయా.



దెబ్బతిన్న పత్తిచేను, చేనులో రైతు సురేష్

అధిక వర్షాలతో పత్తి రైతుల ఆందోళన

కల్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొద్ది రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి చేలలో వరద నీరు చేరింది, దీంతో పత్తి పైరుకు చీడపడీలు సోకి తీవ్రంగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. వరద నీరు చేరడంతో పత్తి మొక్కలు కుళ్లి పోయే ఆవకాశం ఉంది. నీరు నిల్వ ఉండడంతో వేరు కుళ్లు తెగులు వస్తుందని దీంతో రైతులు బెంబెలేత్తుతున్నారు. ఈ సమయంలో పత్తి రైతులు తప్పని సరిగ్గా యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి రూప రైతులకు పలు సూచనలు చేశారు.

విజయ కళాశాలలో వర్క్‌షాపు

కొణిజర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల ఉద్యోగార్హతను మెరుగుపరిచేందుకు టాస్క్, 1యం.1బి ఫౌండేషన్ వారు సంయుక్తంగా జాబ్ రెడినెస్ పేరుతో వర్క్‌షాపును నిర్వహించారు. ఈ వర్క్‌షాపుకు తమన్నాశ్వేత, విఠల్‌నౌబోటే, కార్తికేయలు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టస్క్ వారు తమ కళాశాలలో వర్క్‌షాపు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని కళాశాల వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ అన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల వల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు వెంటనే లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య వర్క్‌షాపును విజయ కళాశాలలో ఏర్పాటు చేసినందుకు టాస్క్ కోఆర్డినేటర్ దినేష్ పూసలకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, ఏవో డాక్టర్ ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోతు చంద్రావతి డిమాండ్ చేశారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, పారిశుధ్య పనులపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలని కోరారు. మంగళవారం ఆమె సమస్యలపై స్పందించారు. వర్షానికి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య అస్తవ్యస్తంగా ఉందని, ప్రత్యేక అధికారులు ఏ గ్రామంలో కూడా కన్పించడం లేదని, వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ ఎరువు కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అందు వల్ల వెంటనే అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

వైరా నియోజకవర్గానికి ఏటీసీ(ఐటీఐ) కాలేజీ మంజూరు

వైరా/ఏన్కూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గానికి ఏటీసీ(ఐటీఐ)ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో ఈ ఐటీఐ కాలేజీ మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏన్కూరు మండలం తూతక లింగన్నపేట(టీఎల్‌పేట) గ్రామపంచాయతీ వద్ద ఈ ఐటీఐ కాలేజీని మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీకి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఐటీఐలకు ఏఐ టెక్నాలజీని జోడించి అధునాతన సాంకేతికతతో ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లుగా అప్‌గ్రేడ్ చేసింది. దానిలో భాగంగానే ఈ ఐటీఐ మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఏటీసీలు అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు చేయనున్నాయని అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు టెక్నాలజీ పూర్తిగా మారిపోయిందని, అన్ని రంగాల్లోనూ మార్పులు వచ్చాయని, ఇప్పుడు పారిశ్రామిక అవసరాల తగ్గ పరిజ్ఞానాన్ని ఏఐ టెక్నాలజీని నేటి యువతకు నేర్పితేనే వారికి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ మంజూరు చేసిందని వివరించారు. వైరాకు ఐటీఐని మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

బోనకల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టై, బెల్టులు, షూస్‌లను ఎంఈవో దామాల పుల్లయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం గుడిమళ్ల నాగేశ్వరరావు స్వంత ఖర్చుతో 34 మంది విద్యార్థులకు దాదాపు రూ. 10 వేల విలువ చేసే షూస్‌లను వితరణగా ఇచ్చారు. అదే పాఠశాలలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయురాలు స్వంత ఖర్చుతో టై, బెల్టులను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సాహం అందించే విదంగా చేయూతను ఇవ్వడం అబినందనీయంగా పేర్కొన్నారు.ఈ క్రింది ఐటమ్‌కు ఫోటో కలదు

జాతీయ స్థాయి ఫొటో ప్రదర్శనలో సతీష్‌రెడ్డికి అవార్డు

- విజయవాడలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని చేతులమీదుగా పురస్కారం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ, గిరిజన దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో నిర్వహించిన ఫొటో ప్రదర్శనలో సత్తుపల్లి మండలం కొత్తూరుకు చెందిన మేకా సతీష్‌రెడ్డి తీసిన చిత్రానికి ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు లభించింది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి విజయవాడలోని బాపూజీ భవన్‌లో ఏపీటీడీసీ చైర్మన్ డా.నూకసాని బాలాజీ, ఏపీ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ డా.గోకరాజు గంగరాజు, ఐపీఆర్ డైరెక్టర్, ఏపీ సాంస్కృతిక సంఘ రాష్ట్ర వైస్ చైర్మన్ ఆర్.మల్లిఖార్జునరావుల చేతులమీదుగా ప్రశంసాపత్రంతోపాటు అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటో ఆర్టిస్ట్ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించారు. కాగా సతీష్‌రెడ్డి గతంలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు తీసుకోవడం సత్తుపల్లికే గర్వకారణమని పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తంచేశారు.

కేవలం మహిళలు పనిచేస్తున్న ఫొటో కాదు

మేకా సతీష్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్, సత్తుపల్లి

అవును. ఈ ఫొటోను తాను స్వయంగా ఆంధ్రాలోని అరకు ప్రాంతంలోని ఓ గిరిజన గ్రామంలో తీశానని చెప్పారు. ఇది కేవలం మహిళలు పనిచేస్తున్న ఫొటో కాదని, వారి శ్రమకు, సంస్కృతికి, సాధారణ జీవితంలోని అసాధారణ గౌరవానికి అద్దం పట్టిన దృశ్యమని భావిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్‌పీసీ తమ్మా శ్రీనివాసరెడ్డి, క్లాసిక్ షరీఫ్ (భద్రాచలం), బొమ్మల వెంకన్న (కోదాడ) సహకారంతో తనకు ఈ అవార్డు లభించిందని చెప్పారు.



సతీష్‌రెడ్డిని అభినందిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే దంపతులు